హైదరాబాద్ వార్త





# పాతబస్తీలో ఆధ్యాత్మిక కోలాహలం

## ఏనుగు అంబారీపై బీబీకా ఆలం-రక్తపాతాల మధ్య భక్తిశ్రద్ధలు

**హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త :** పాతబస్తీలో మొహర్రం ఊరేగింపు కోలాహలంగా సాగింది. శుక్రవారం షియా ముస్లింలు బీబీకా ఆలంతో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో ముస్లింలు నల్లటి దుస్తులు ధరించి కత్తులు, బ్లేడ్లతో తమ శరీరా లను గాయపర్చుకుని రక్తం చిందించారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, టిజీఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ తదితరులు ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఈ ఊరేగింపు డబీర్‌పురా దర్వాజా, యాకుత్‌పురా, కోట్ల అలీజా, చార్మినార్, మీరాలం మండి, దారుషిఫా నుంచి చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది. ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.



# మియాపూర్ సిఐ శివప్రసాద్‌పై బదిలీ వేటు

## సివిల్ వివాదంలో జోక్యం ఎఫెక్ట్

**శేరిలింగంపల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** మియాపూర్ సీఐ శివప్రసాద్‌పై బదిలీవేటు పడింది. సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలతో శివప్రసాద్‌ను బదిలీ చేసి సైబరాబాద్ సీపీ కార్యాలయానికి సీపీ రమేశ్ రెడ్డి అటాచ్ చేశారు. ఒక ప్రైవేటు ఆసుపత్రి భూ వివాదంలో నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని నిబంధనలను చెబుతున్నా వాటిని బేఖాతరు చేస్తూ పోలీసుల జోక్యం శృతిమించిపోతుండటంపై సీపీ సీరియస్ అయ్యారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# సెల్ డ్రైవింగ్ హెల్

## వాహనం నడుపుతూనే వినోదం

★ గంజాయి మత్తులో ప్రమాదకర విన్యాసాలు ★ ఆర్టీసీ, ప్రైవేటు టూరిస్టు డ్రైవర్లదీ అదే తీరు ★ బేజారెత్తిస్తున్న మైనర్ల త్రిబుల్ రైడింగ్ ★ చలాన్ల వసూళ్లే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు! ★ స్పెషల్ డ్రైవ్‌లకు స్వస్థి ★ పాదచారులూ రాంగ్ రూటే ★ ఫుట్‌పాత్‌లను వదిలి రోడ్లపై ఫోన్ చాటింగ్ ★ మృత్యు ఒడికి చేరుస్తున్న నిర్లక్ష్యం



**చాంద్రాయణగుట్ట, జూన్ 26 ప్రభాతవార్త:** నగరంలో వాహన డ్రైవింగ్‌పై నియంత్రణ పూర్తిగా కొరవడింది. ఎవరికి తోచినట్లు వారు వాహనాలను నడుపుతూ, "నా వాహనం... నా ఇష్టం" అన్న తరహాలో అడ్డదిడ్డంగా వెళుతున్నారు. దీనివల్ల తోటి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టించడమే కాకుండా, కొన్నిసార్లు ఘోర ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొందరు డ్రైవర్లు గంజాయి మత్తులో మునిగి తేలుతుండగా, మైనర్ల త్రిబుల్ రైడింగ్ వాహనదారులకు తీవ్ర బేజార్ తెప్పిస్తోంది. మరికొందరైతే జీపీఎస్ పేరుతో రీల్స్, సినిమాలు చూస్తూ, పాటలు వింటూ, చాటింగ్ చేస్తూ, ఫోన్లలో మాట్లాడుకుంటూ రకరకాల విన్యాసాలతో వాహనాలు తోలుతున్నారు. పాదచారులు సైతం తామేమి తీసిపోలేదన్నట్లు ఫుట్‌పాత్‌లను వదిలేసి, ఫోన్లలో మాట్లాడుకుంటూ రోడ్లపై ఎటు వైపు వెళుతు న్నారో తెలియకుండా నడుస్తున్నారు. వీరు ఉన్నఫళంగా రోడ్డు దాటుతుండటంతో, ప్రమాదాలను నివారించడానికి వాహనదారులు సడన్ బ్రేక్ వేయాల్సి వస్తోంది. ఫలితంగా ఆ వెనుక వచ్చే వాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. దీనివల్ల ఇరువర్గాలు రోడ్డుపై కుస్తీలు పడుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి, అత్యవసర పనులపై వెళ్లే సాధారణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**దశాబ్దాల నాటి ఇరుకు రహదారులు**

పాతబస్తీ లాంటి ప్రాంతాలలో దశాబ్దాల నాటి రోడ్లు విస్తరించకపోవడం, వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటం ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతుండగా, మరోవైపు సెల్ డ్రైవింగ్ ప్రజల పాలిట హెల్‌గా మారుతోంది. దీనిని కట్టడి చేయడానికి నగర ట్రాఫిక్ పోలీసులు అక్కడక్కడా, అప్పుడప్పుడు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నా కొందరి ప్రవర్తనలో మాత్రం మార్పు రావడం లేదు. పైగా చలాన్ల పేరుతో నగర ట్రాఫిక్ విభాగం ఖజానా గలగలమంటోంది.

**బైక్ నుంచి బస్సు వరకూ ఇదే చోద్యం**

నగర రోడ్లపై నిత్యం సంచరించే ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు తోడు లారీలు, ఆర్టీసీ, ప్రైవేటు టూరిస్టు బస్సులు నడిపేవారు కూడా కుదురుగా వాహనం నడపడం లేదు. గంజాయి మత్తులో రీల్స్, సినిమాలు చూస్తూ, వాహనం నడుపుతూనే సెల్‌ఫోన్లలో ఎంజాయ్ చేస్తున్నారు. నిమిషాల కొద్దీ ఫోన్లలో మాట్లాడుతున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు హ్యాండిల్‌కు మధ్యలో సెల్‌ఫోన్ బిగించుకుని ఒకవైపు రీల్స్ చూస్తూ, మరోవైపు డ్రైవింగ్ చేస్తున్నారు. కారు డ్రైవర్లు, వ్యాన్, భారీ వాహనదారులు డాష్ బోర్డుకు సెల్‌ఫోన్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్లలో మాట్లాడుకుంటూ, ఇతరులతో చాటింగ్ చేస్తూ అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్నారు. వారు ఎటు వెళుతున్నారో తెలియక వాటి వెనుక నుండి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు యాక్సిడెంట్లు జరుగుతున్నాయి.





మిగతా 3లో

# ఆన్‌లైన్‌లోనూ 'సర్'

## బిఎల్‌వోల అవసరం లేకుండా వివరాల నమోదుకు ఛాన్స్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా తమ ఎన్యూమరేషన్ ఫారం సమర్పించే సౌకర్యాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈ నెల 25నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అయితే, బీఎల్‌వోలు వచ్చి ఫారాలు అందజేసే వరకు వేచి చూడకుండా.. ఆన్‌లైన్‌లో కూడా ఫారాలు సమర్పించవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గత ప్రాథమిక ఓటరు జాబితా ఆధారంగా వివరాలను ధృవీకరించి ఫారాన్ని సమర్పించవచ్చని తెలిపింది. అయితే ఆన్‌లైన్‌లో ఈసైన్ (ఈసంతకం) ద్వారా ఫారాన్ని సమర్పించడానికి ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలు పాటించాలని స్పష్టంచేసింది.

ఓటరు ఐడీ(ఈఎపిక్)తో మొబైల్ నంబరు అనుసంధానమై ఉండాలి.

- ఓటరు ఐడీలోని పేరు, స్పెల్లింగ్, ఓటరు ఆధార్ కార్డుతో కచ్చితంగా సరిపోలాలి.
- ఏదైనా వ్యత్యాసం ఉంటే డిజిటల్ ఈసైన్ విఫలం అవుతుంది.
- అలాంటి సందర్భాల్లో ఓటరు తమ బిఎల్‌వోల ద్వారా ఫారం సమర్పించాలి.

**నమోదు ఇలా..**

ఓటర్లు ఎన్నికల సంఘం అధికారిక ఓటరు సర్వీస్ పోర్టల్, లేదా ఈసీఐనెట్ మొబైల్ యాప్‌లో లాగిన్ అయి ఫిల్ ఎన్యూమరేషన్ ఫారంను ఎంపిక చేసుకోవాలి. అనంతరం రాష్ట్రాన్ని ఎంపిక చేసి, 10 అంకెల ఓటరు ఐడి సంఖ్యను నమోదు చేయాలి. వివరాలు ధృవీకరించిన తర్వాత నమోదిత మొబైల్‌కు వచ్చే



ఓటీపీని నమోదు చేస్తే ఫారం పూర్తి చేసేందుకు అవకాశం లభిస్తుంది. ఓటరు తన వివరాలను గత ఎస్ఐఆర్(2002) జాబితాలతో అనుసంధానించేందుకు మూడు కేటగిరీల్లో ఒక దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. 1. గత ఎస్ఐఆర్‌లో ఓటర్ల జాబితాలో నా పేరు ఉంది. 2. గత ఎస్ఐఆర్‌లో నా తల్లిదండ్రుల(తండ్రి, తల్లి, తాత, నాయనమ్మ, అమ్మమ్మ) పేరు ఉంది. 3. గత ఎస్ఐఆర్‌లో నా పేరు గానీ, నా తల్లి తండ్రుల పేరుగానీ లేదు. ఈ వివరాల కోసం "సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ సర్ "అనే ఆప్షన్‌ను వినియోగించి వివరాలు పొందవచ్చు. ఈ తర్వాత ఎన్యూమరేషన్ ఫారంను ఓటరు వివరాలతో నింపాలి. పాత ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వారి కుటుంబ సభ్యుల పేరు ఉంటే, చట్టపరమైన లింకేజీని ఏర్పరచడానికి బంధువు పేరు, రిలేషన్, పాత నియోజకవర్గం, పార్ట్ నంబరు, వివరాలను నమోదు చేయాలి. ఓటరు అవసరమైతే తమ పుట్టిన తేదీని అప్‌డేట్ చేయవచ్చు. లేదా ఇటీవల పాస్‌పోర్టు ఫోటోను అప్‌లోడ్ చేయవచ్చు. ఎన్యూమరేషన్ ఫారం నింపిన తర్వాత అక్షర దోషాలను సరిచేసేందుకు, వివరాలను సమీక్షించడానికి "ప్రివ్యూ బటన్"పై క్లిక్ చేయాలి. అంతా ఖచ్చితంగా ఉంటే, డిక్లరేషన్ చెక్‌బాక్స్"పై క్లిక్ చేసి సబ్‌మిట్ చేయాలి. చివరికి డిజిటల్ సంతకం చేసి ఫారాన్ని సమర్పించవచ్చు.

# 20 ఏళ్ల పరారీకి ఎండ్ కార్డ్

✦హైదరాబాద్‌లో అర్షద్ అలీ.. ✦మహారాష్ట్రలో షకీల్‌గా మాయాజాలం!

✦హత్యలు, చోరీల హిస్టరీ.. ✦బంజారాహిల్స్‌పోలీసులకు చిక్కిన కిలాడీ రౌడీషీటర్ ✦మహారాష్ట్రలో 36 గంటల ఆపరేషన్ ✦టీ తాగడానికి వచ్చి దొరికిన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త :** ఆయుధ చట్టం కింద నమోదైన ఒక కేసులో 20 ఏళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న ఒక రౌడీషీటర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పేరు మార్చుకొని మహారాష్ట్రలో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సుహాసన్ కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే అర్షద్ అలీ(50) కార్మికుడిగా పనిచేసేవాడు.

2003లో బంజారాహిల్స్‌లో ఒక హత్య కేసు, నిజామాబాద్‌లో ఒక హత్య కేసు, హుమాయిన్‌నగర్‌లో మరో హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. వీటితోపాటు వనస్థలిపురంలో చోరీ కేసులో జైలుశిక్ష అనుభవించి వచ్చాడు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు ఇతనిపై రౌడీషీట్ తెరిచారు. 2006లో అర్షద్ అలీ ఇక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం 2020లో బంజారాహిల్స్‌కు వచ్చిన అతనిపై ఆయుధ చట్టం కింద కేసు నమోదైనప్పటికి పరారీలో ఉన్నాడు. దాదాపు 20 ఏళ్ల నుంచి పరారీలో ఉన్న అతని కోసం బంజారాహిల్స్ పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలో ఉంటున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు గుర్తించారు.



నిందితుడు అర్షద్ అలీ అలియాస్ షకీల్

బంజారాహిల్స్ ఎస్సై శ్రీనివాస్, ఏఎస్సై ముజఫర్, హెడ్ కానిస్టేబుల్ సుభాష్ బృందం నేరుగా మహారాష్ట్రలోని పాలఘడ్ జిల్లా వసాయి గ్రామానికి వెళ్లారు.

అక్కడ దాదాపు 36 గంటలపాటు కాపుకాసి టీ తాగడానికి వచ్చిన రౌడీషీటర్ అర్షద్ అలీని అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని విచారించగా మహారాష్ట్రలో షకీల్ పేరుతో ఉంటున్నట్లు గుర్తించారు. పెళ్లై ఇద్దరు పిల్లలున్న అతను మహారాష్ట్రలో మరో పేరుతో ఇంకో పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**సిబ్బందికి సిఐ అభినందన**

నిందితుడిని అరెస్ట్ చేసి నగరానికి తరలించారు. ఇదిలా ఉండగా సమాచారాన్ని సేకరించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో కీలకంగా వ్యవహరించిన ఎస్సై, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌ను ఇన్‌స్పెక్టర్ సుహాసన్ అభినందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# 1 నుంచి 14 వరకూ నీట్ ఉచిత కోచింగ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** వైద్య విద్యను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు నాణ్యమైన నీట్ కోచింగ్‌ను పూర్తిగా ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో క్వాలిటీ థాట్ - అన్ అకాడమీ సెంటర్, సంయుక్తంగా ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి. "మిషన్ 100" అనే వినూత్న రెండు వారాల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం మాదాపూర్‌లోని అన్ అకాడమీ సెంటర్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని క్వాలిటీ థాట్ వ్యవస్థాపకుడు, అన్ అకాడమీ సెంటర్ ఫ్రాంచైజీ పార్ట్‌నర్ రమణ భూపతి ప్రారంభించగా, ఐకాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కృష్ణ చింతలూరి, జనరల్ సర్జరీ హెచ్ఓడీ డా. వెంకట్ పవన్, అనస్థీషియా హెచ్ఓడీ డా. వేణుగోపాల్, సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డా. రాజశేఖర్ మదాల, ఎయిమ్స్ ట్రామా సర్జన్ డా. దామోదర్ కాకుమాను పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా రమణ భూపతి మాట్లాడుతూ, జూలై 1 నుంచి జూలై 14 వరకు ఈ ప్రత్యేక ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు నీట్ కోచింగ్, స్టడీ మెటీరియల్, వసతి, పోషకాహారం, మెంటార్‌షిప్, కెరీర్ గైడెన్స్ అన్నీ పూర్తిగా ఉచితంగా అందజేస్తామని, విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయబోమని స్పష్టం చేశారు. 150 మంది రెసిడెన్షియల్ విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం కల్పించడంతో పాటు, 500 మంది డే స్కాలర్ విద్యార్థులకు ఉచిత నీట్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9160934149 నంబర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణభూపతి, కృష్ణ చింతలూరి తదతరులు

# లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు మృతి

**సైఫాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు గురువారం రాత్రి 11.30 గంటలకు మృతి చెందారు. హిమాయత్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్‌రావు గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైనారు. ఆయన రైతుల సంక్షేమం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేశారు. మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన భౌతిక కాయానికి శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతి పట్ల పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. రాజేశ్వర్‌రావు మృతి పట్ల దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, నేషనల్ డెమోక్రటిక్ సెక్యూలర్ ఫ్రంట్ ఛైర్మన్ వడ్డమూరి కృష్ణస్వరూప్, విద్యార్థి నాయకులు గణేష్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు, రాష్ట్ర కార్యదర్శి నక్కా దేవేందర్, ప్రముఖ కవి, గాయకుడు యశ్‌పాల్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ రాజేశ్వర్‌రావు అనారోగ్యం నుంచి కోలుకుని తిరిగి ప్రజల జీవన, ఆర్థిక, రాజకీయ సమస్యలపైన పోరాటం చేస్తారని తామంతా భావించామని, కాని ఆయన మన నుంచి భౌతికంగా దూరం అవడం చాలా బాధకరంగా ఉందన్నారు. ఆయన మరణం రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు తీరని లోటన్నారు. ముఖ్యంగా రైతుల పక్షాన జాతీయ పార్టీతో కలిసి ఆనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు వడ్లమూరి సానుభూతి తెలియజేశారు.







## చరిత్ర పుటల్లోకి

# తొలి ఐటీ టవర్

## బేగంపేట ఇంటర్‌గ్రాఫ్ భవనం కూల్చివేత

**బేగంపేట, జూన్ 26, ప్రభాతవార్త :** హైదరాబాద్ ఐటీ రంగానికి ఆద్యంపోసిన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన మొదటి ఐటి టవర్ (ఇంటర్‌గ్రాఫ్ భవనం) జ్ఞాపకం మాత్రమే. నేటి తరానికి ఐటీ హబ్ అంటే మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ వంటి ప్రాంతాలే గుర్తొస్తాయి కానీ, భాగ్యనగరంలో మొదటి తరం ఐటీ ఉద్యోగులకు మాత్రం బేగంపేట ఒక మధురమైన జ్ఞాపకం. 1987లో అమెరికాకు చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ ఇక్కడ తన కార్యకలాపాలను ప్రారంభించి, నగరంలోనే మొదటి ఐటీ టవర్‌గా రికార్డు సృష్టించింది.

**భవన భద్రత దృష్ట్యా..**

ఇటీవల ఈ బిల్డింగ్‌కు సంబంధించిన భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీని కూల్చివేత పనులను చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అయితే, ఇదే ప్రాంతంలో భవిష్యత్తులో సరికొత్త వాణిజ్య భవన సముదాయాన్ని నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**అప్పట్లో ఐటీకి కేరాఫ్ అడ్రస్..**

మాదాపూర్‌లో సైబర్ టవర్స్ వెలిసి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించడానికి ముందే హైదరాబాద్ ఐటీ సామ్రాజ్యానికి బేగంపేట, అమీర్‌పేటలే ప్రధాన కేంద్రాలుగా వర్ధిల్లాయి. బేగంపేట పరిసరాల్లోనే బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో, ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి ప్రముఖ సంస్థలు ఏర్పాటయ్యాయి. మేఫెయిర్ సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో ప్రసిద్ధ సత్యం సంస్థ నడిచింది. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజీగూడలో ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను సాగించాయి.

**విమానాశ్రయం అందుబాటులో ఉండటం వల్లే..**

నాడు అంతర్జాతీయ ప్రయాణాలకు బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం వల్లే గ్లోబల్ ఎంఎన్‌సీ కంపెనీలన్నీ ఈ ప్రాంతంలోనే తమ ఆఫీసులను ఏర్పాటు చేయడానికి మొగ్గు చూపాయి. దశాబ్దాల పాటు ఎందరో ఐటీ నిపుణులను తీర్చిదిద్ది, నగర సాఫ్ట్‌వేర్ ప్రస్థానానికి పునాది వేసిన ఈ మొదటి ఐటీ టవర్.. ప్రస్తుత కూల్చివేతతో కేవలం చరిత్ర పుటల్లోనే ఒక మైలురాయిగా మిగిలిపోనుంది.



మోతీలాల్ నెహ్రూనగర్ పార్క్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కిషన్ రెడ్డి

## ప్రతి రోజూ

# ఫిట్‌నెస్

## కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి

## వేర్వేరు చోట్ల పార్కులలో జిమ్‌లు ప్రారంభం

**బేగంపేట, జూన్ 26, ప్రభాతవార్త:** ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకునేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతగానో దోహదపడతాయని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రామ్‌గోపాల్‌పేట డివిజన్ జవహర్‌నగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. జవహర్‌నగర్ కాలనీలో కార్యక్రమం అనంతరం కేంద్ర మంత్రి బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌లోని పార్కును సందర్శించారు. అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం స్థానిక ప్రజల సౌకర్యార్థం మరో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సంజీవరెడ్డినగర్ :** సనత్‌నగర్‌లోని నెహ్రూ పార్కుకు ఎదురుగా ఉన్న ఆయుర్వేద పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కేంద్ర కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజల ఆరోగ్యంతో పాటు స్థానిక జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఇందిరాపార్కులో**

**ముషీరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఆధునిక సమాజంలో అందరూ తీవ్రమైన మానసిక వత్తిడిని ఎదుర్కొంటున్నారని, దీనిని అధికమించాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్ డివిజన్‌లోని హైలైన్ అపార్ట్‌మెంట్‌లో, ఇందిరాపార్కులో, దోమలగూడలోని గగన్‌మహల్ పార్కులో ఓపెన్ జిమ్‌లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

# భార్యతో గొడవపడి.. యువకుడు ఆత్మహత్య

**వనస్థలిపురం, జూన్ 26 ప్రభాతవార్త :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీమతి నగర్, వనస్థలిపురానికి చెందిన గుట్ల రాజేష్ (26) తన భార్య ఆశ ప్రవాళికతో కలిసి ఉప్పల్‌లో నిర్వహించిన టీజీపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించి ఇంటికి చేరుకున్నాడు. అనంతరం స్నేహితుడితో కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకోగా, మనస్తాపానికి గురైన రాజేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి చక్రయ్య ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రవి నాయక్ తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# 15న వేలాది మంది విద్యార్థులతో 'చలో హైదరాబాద్'

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** లక్షలాది మంది విద్యార్థులకు కల్పిస్తున్న ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆనేక కుట్రలకు పాల్పడుతున్నదని బిసి జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం చేయాల్సిన పనులను కోర్టు ద్వారా చేయిస్తున్నదని, ఈ వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ జులై 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'కళాశాలల బంద్' చేపడతామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం సైఫాబాద్‌లోని బిసి భవన్‌లో బిసి జెఎసి కన్వీనర్ పెరిక సురేష్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జులై 15న వేలాది మంది విద్యార్థులతో 'చలో హైదరాబాద్' పేరిట ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థుల సత్తా చాటుతామన్నారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్‌పై గురువారం రాష్ట్ర హైకోర్టు విద్యార్థుల నుంచే ఫీజులు కళాశాల యాజమాన్యాలు వసూలు చేసుకోవచ్చునని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ళ నుంచి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేయడానికి ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జివోలు 7,8.9 వల్ల లక్షలాది మంది విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలి

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్‌లో నిజాంపేట్–బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్యలో చెత్త డంపింగ్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డుకు ఆనుకుని మహిళా డిగ్రీ కళాశాల ఉండటంతో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. కళాశాల ఆవరణలోనే చెత్త ఉన్నట్లుగా కనిపిస్తోందని, అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థినులు కూడా వెనుదిరిగే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల నుంచి నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీల వరకు రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

డంపింగ్ యార్డును వెంటనే అనుకూలమైన ప్రాంతానికి తరలించి, ప్రస్తుతం ఉన్న ప్రదేశాన్ని పూర్తిగా శుభ్రపరిచి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. స్వామి, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎజి కాలనీలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

## ఘనంగా మొహర్రం వేడుకలు

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం శుభాకాంక్షలు తెలియజేస్తూ సామరస్యం, సోదరభావం, శాంతి సౌభ్రాతృత్వాలను కాపాడాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### బోయిన్‌పల్లిలో

**కంటోన్మెంట్,జూన్ 26 ప్రభాతవార్త:** మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లి, కడక్‌పుర దర్గా వద్ద నిర్వహించిన వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్‌లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్బాల యుతంలో హజ్రత్ హిమామ్‌హుస్సేన్ అనుచరులు సత్యం కోసం ప్రాణాలర్పించారని, వారి గుర్తుగా పిరీలను ఊరేగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చోటు, మౌలా, సులేమాన్,ముఖేష్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి శర్బత్‌ను పంపిణీ చేశారు.



సమావేశానికి హాజరైన బిజెపి పార్టీ శ్రేణులు

## బిజెపి చీఫ్ పర్యటనను విజయవంతం చేయాలి

**దుండిగల్, జూన్ 26, ప్రభాతవార్త :** బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఈ నెల 28న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బూత్ అధ్యక్షుల సన్నాహక సమావేశానికి హాజరవనున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్ చారి తెలిపారు. శుక్రవారం దుండిగల్ సర్కిల్ బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేయడంలో ఈ సమావేశం కీలకంగా నిలుస్తుందన్నారు. ప్రతి డివిజన్‌లోని నాయకులు తమ పరిధిలోని కార్యకర్తలను సమన్వయం చేసుకుని భారీ సంఖ్యలో హాజరయ్యేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు మల్లేష్ యాదవ్, రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు వెంకటేష్ నాయక్, శ్యామ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, సీతారాం రెడ్డి, ఆకుల విజయ్, ఎంబరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రు. 78వేల ఆర్థిక సాయంతో ప్రాణదానం

**కుత్బుల్లాపూర్, జూన్ 26 ప్రభాతవార్త:**

అసలే పేదరికం. అపై క్యాన్సర్ మహమ్మారితో సతమతమవుతూ ప్రాణాలు అరచేతితో పెట్టుకుని చికిత్స పొందుతున్న మహిళకు మేమున్నామని కుత్బుల్లాపూర్ యాదవసంఘం చేయూతనిచ్చింది. కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్‌కు చెందిన సరితాయాదవ్ కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక స్థోమతలేక వ్యాధి రోజురోజుకు పెరుగుతూ తీవ్ర మనోవేదనకు గురవుతుంది. ఆపదలో కాన్సర్ చికిత్సకు అవసమైన వ్యయంలో కొంత భాగంగా రూ.లు.78000 ఆర్థిక సహాయం ఆసుపత్రికి అందజేసి భరోసా ఇచ్చింది. కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ అధ్యక్షులు లగ్గాల వెంకట్‌రావు తనవంతు ఆర్థిక సహాయంగా రు.లు. 30.000లను అందజేయడంతోపాటు తనసంఘ ప్రతినిధుల ముందుకు విషయం తీసుకువచ్చారు. మానవతా దృక్పథంతో స్పందించిన యాదవసంఘ ప్రతినిధులు వేల్పూరి శ్రీనివాసరావు యాదవ్ ,సురేశ్‌యాదవ్, అశోక్‌యాదవ్, శివ నాగరాజు యాదవ్‌లు రులు ఐదువేల చొప్పున సహాయంచేయగా, వెంకటేశ్వర్లు యాదవ్, తిరుమలరాజు యాదవ్, కుక్కల శ్రీనివాసరావు యాదవ్, శివప్రసాద్‌యాదవ్‌లు ఒక్కొక్కరు రు.లు. మూడువేల రూపాయలచొప్పున ఆర్థిక సహహాం చేయగా, గుండ్లపల్లి మాల్యాద్రియాదవ్, గాజుల శ్రీనివాస్‌యాదవ్, తిక్కా శ్రీనివాస్‌యాదవ్, రంగనాథ్‌యావ్, పల్లపోతు రాముడు యాదవ్, జె.వి.ఎన్. కృష్ణయాదవ్, బెనర్జియాదవ్‌లు తలా ఒక రెండువేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని జీడిమెట్ల లోని కోనార్క్ ఆసుపత్రి వర్గాలకు అందజేసి ఆపరేషన్‌కు సహకరించారు. ప్రత్యేక సహకారంగా శ్రీనివాస్‌గౌడ్ ఐదువేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేయగా రాజారావు వెయ్యిరూపాలను సహాయంచేసి ఆదుకున్నారు. సాటిమనిషి ఇబ్బందుల్లో వుంటే తామున్నామని ఎవరికివారు తోచినంద ఆర్థిక సహకారం అందించిన కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ ధాతృత్వం ప్రేరణగా నిలిచింది.



జీడిమెట్ల కోనార్క్‌ఆసుపత్రిలో క్యాన్సర్ వాధిచికిత్సపూర్తయి కోలుకుంటున్న సరితాయాదవ్



## ఆత్మరక్షణకు కరాటేనే ఆయుధం

**చిక్కడపల్లి ,జూన్ 26, ( ప్రభాతవార్త ) :**

గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని జనతా పార్కులో రుద్రమదేవి షోటోకాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన చిన్నారులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడుతూ కరాటే శిక్షణ ద్వారా పిల్లల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు.

యువతకు ఆత్మరక్షణ శిక్షణ అందిస్తూ సమాజానికి సేవ చేస్తున్న రుద్రమదేవి షోటోకాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ సంస్థను అభినందించారు. కరాటే మాస్టర్ కే. నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ఎన్. లక్ష్మి ్మ, చీఫ్ ఎగ్జామినర్ డా. రవి, జి. నర్సింగ్, నిజాంభాయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తాకట్టు డబ్బులు కట్టించి..

## ఆభరణాలతో జారుకున్నాడు

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త:** తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను విడిపించాలని నమ్మించి ఓ వ్యక్తివి గోల్డ్ సంస్థను రూ.2 లక్షలు మోసం చేసిన సంఘటన పంజాగుట్ట ఠాణాలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. సోమాజీగూడకు చెందిన డి. హరికృష్ణ అనే వ్యక్తి శ్రీనగర్‌కాలనీలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో 24.6 గ్రాముల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టాడు. కాగా తనఖా పెట్టన నగలను తీసుకోలేని పరిస్థితిలో ఆయన ఖైరతాబాద్‌లోని విగోల్డ్ సంస్థను సంప్రదించి ఆభరణాలను విడిపించేందుకు సాయం కోరాడు. వి గోల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న టిఎ సమీర్‌తో కలిసి హరికృష్ణ బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లగా అక్కడ బ్యాంకు సిబ్బంది మొత్తం రూ. 2.05 లక్షలు చెల్లించాలని సూచించారు. హరికృష్ణ ఈ విషయాన్ని సమీర్‌కు తెలియజేశాడు. ఈ క్రమంలోనే హరికృష్ణ బ్యాంకుకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌ను పంపాడు. వి గోల్డ్ సంస్థ అనుమతి ద్వారా సమీర్ రూ.2.05 లక్షలను అతని బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. దీంతో బ్యాంకు అధికారులు తాకట్టు పెట్టిన నగలను తిరిగి ఇవ్వగా ఆభరణాలను తీసుకున్న హరికృష్ణ తాను మూత్ర విసర్జనకు వెళ్లి వస్తానని నమ్మించి సమీర్‌ను బురిడీ కొట్టించి అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన సమీర్ అతని కోసం వెదకగా కనిపించలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో, ముందస్తు ప్రణాళిక ప్రకారమే మోసానికి పాల్పడి బంగారు ఆభరణాలతో పరారైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఈ కేసును నమెదు చేసి పంజాగుట్ట ఠాణా పరిధిలోకి రావడంతో కేసును పంజాగుట్ట ఠాణాకు బదిలీ చేశారు.

## 12న తిరుపతిలో దక్షిణ భారత కురుమ సంఘం సమావేశం

**సైఫాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశం కురుబ, కురుమ, కురుంబన్, కురువన్, దంగర్ సంఘ సమావేశం జులై 12వ తేదీ పట్టణంలో జరుగుతుందని సంఘం తెలిపింది. ఈ సమావేశానికి దక్షిణ భారతదేశంలోని రాజకీయ నాయకులు, మేధావులు పాల్గొని ప్రసంగిస్తారని సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, అధికార ప్రతినిధి కె.వి.చలపతి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా తమ కులస్తులు పది కోట్ల మంది ఉన్నారని, దక్షిణ భారతదేశంలో వివిధ పేర్లతో రెండు కోట్ల మంది ఉన్నారని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 60 లక్షల మందికి ఉన్నారని తెలిపారు. కాగా ఉభయ తెలుగు రాష్ట్రాలో రాజకీయంగా తగినంత ప్రాధాన్యత లభించడం లేదని, నార్త్ ఇండియా, కర్ణాటక తదితర రాష్ట్రాలలో బిజెపి రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తున్నదన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం కురుమ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసింది, ఆదే విధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో గత ప్రభుత్వం కురుమ ఆత్మగౌరవ భవన్ ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించడం జరిగిందని, ఆదేవిధంగా ఎపి , కర్ణాటక తదితర రాష్ట్రాలు కూడా కేటాయించాలని, తెలంగాణలో ఒక ఎమ్మెల్సీ, ఒక మంత్రి పదవిని కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

## ఆర్థిక సంస్కరణల మార్గదర్శి పివి

**చిక్కడపల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** ప్రపంచీకరణ నేపథ్యంలో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి నాటి ప్రధాని పి.వి. నరసింహారావు, ఆర్థిక నిపుణుడు మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా ఎంచుకుని సంస్కరణలను ధైర్యంగా అమలు చేసిన గొప్ప మార్గదర్శి అని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ కొనియాడారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 105వ జయంతి సభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ పీవీ నరసింహారావు బహుభాషా పండితుడని, అసాధారణ రాజనీతిజ్ఞుడని ఆయన అభివర్ణించారు. నాడు పార్లమెంట్‌లో తమ ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ లేకపోయినా, భిన్న సిద్ధాంతాలు కలిగిన ప్రతిపక్ష పార్టీలను సైతం తన చతురతతో మెప్పించి, ఐదేళ్లపాటు పూర్తి కాలం ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించిన ఖిఅపర చాణక్యుడు పీవీ అని కొనియాడారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, వికలాంగుల సంఘం జాతీయ నాయకుడు కొల్లి నాగేశ్వరరావు , గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

## రక్తనాళాల్లో గడ్డలను తొలగించే నిమ్స్ అత్యాధునిక చికిత్స

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త:** రక్తనాళాల్లో గడ్డలను తొలగించే అత్యాధునిక చికిత్స ద్వారా ఒక మహిళకు నిమ్స్ వైద్యులు విజయవంతంగా చికిత్సచేశారు. నిమ్స్‌లో ఈ తరహా చికిత్సను నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బయ్యారం గ్రామానికి చెందిన కొలిచేల్మి రజనీ(39)కి కాళ్లలోని లోతైన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే ఆరోగ్య సమస్య ఏర్పడింది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స అందించకపోతే ఆ గడ్డ ఊపిరితిత్తులకు చేరి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంటుంది. నిమ్స్ ఆసుపత్రికి వచ్చిన మహిళలకు ఈ చికిత్సలో ముందుగా రక్తం గడ్డకట్టిన ప్రాంతంలో ప్రత్యేక ఔషధాలను ప్రవేశ పెట్టి గడ్డను కరిగించారు. అనంతరం అత్యాధునిక పరికరం సహాయంతో గడ్డను పూర్తిగా తొలగించారు. దీంతో రక్తప్రసరణ సాధారణ స్థితికి చేరడంతో పాటు రోగి త్వరగా కోలుకునే అవకాశం లభించింది. అలాగే భవిష్యత్తులో కాళ్ల వాపు, నొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని వైద్యులు తెలిపారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ, ఈ చికిత్సకు అయ్యే సుమారు రూ.5 లక్షల వ్యయాన్ని ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా అందించామని తెలిపారు. ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించిన రక్తనాళాల శస్త్రచికిత్స విభాగాధిపతి డా. సందీప్ మహాపాత్ర నేతృత్వంలోని వైద్య బృందంతో పాటు మత్తు వైద్య విభాగం, గుండె రక్తనాళాల పరీక్ష విభాగం, నర్సింగ్ సిబ్బంది, ఇతర అనుబంధ వైద్య సిబ్బందిని నిమ్స్ డైరెక్టర్ అభినందించారు.



చికిత్స పొందిన రజనీతో శస్త్రచికిత్స నిర్వహించిన నిమ్స్ వైద్యబృందం

## ఫిర్యాదు చేసినా పట్టించుకోరేం?

### డ్రెయినేజీ ఇబ్బందులపై సిపిఐ నేతల ఆగ్రహం

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ డివిజన్ ఇంద్రన్న కాలనీలో గతవారం రోజు లుగా డ్రైనేజీ పొంగి ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుమార్లు మున్సిపల్ అధికారులకు, సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరి ష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు, వాటర్ బోర్డు అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే ఇటువంటి సమస్యలకు కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంద్రన్న కాలనీలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

## అలరించిన నైనిక కూచిపూడి నృత్య ప్రదర్శన

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త :** నిజాంపేట్‌లోని మల్లికార్జున స్వామి ఆడిటోరియంలో నిర్వహించిన చిన్నారి గొడవర్తి నైనిక కూచిపూడి నృత్య అరంగేట్రం కార్యక్రమం ఆహుతులను ఎంతగానో అలరించింది. సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ ప్రదర్శనకు కళాభిమానులు, ఆహ్వానితులు విశేషంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు లయన్ ఎస్.పి. భారతి, డాక్టర్ బ్రహ్మశ్రీ జక్కా శ్రీకృష్ణ, నాట్య గురువు డాక్టర్ రామాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిన్నారి నైనిక శివస్తుతి, భామకలాపం, తిల్లానా వంటి కూచిపూడి నృత్య రూపకాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తన హావభావాలు, అడుగుల సమన్వయం, భావ వ్యక్తీకరణతో చిన్న వయసులోనే మంచి ప్రతిభ కనబరిచింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు రిషిక, కార్తీక అందించిన సంగీత, వయోలిన్ వాయిద్య ప్రదర్శనలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి సంగీత విన్యాసాలు సభికులను అలరించాయి. కార్యక్రమం మొత్తం సాంస్కృతిక వాతావరణాన్ని తలపిస్తూ కళాత్మకంగా సాగింది. చిన్నారి నైనిక తల్లిదండ్రులు శ్రీనివాస్, దీపావతి కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, ఆశీర్వదించిన పెద్దలకు, కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



మహిళాలకు చీరెల పంపిణి చేస్తున్న మాజీ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్, బిజెపి కార్యవర్గ సభ్యులు వి.పాండుయాదవ్‌లు

## గౌలిగూడలో చీరెల పంపిణీ...

**బేగంబజార్,జూన్ 26ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీరల పంపిణి భాగంగా గౌలిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి మాజీ ఫ్లోర్‌లీడర్ గొంటి శంకర్‌యాదవ్,బిజెపి కార్యవర్గసభ్యులు వి.పాండుయాదవ్ మహిళా గ్రూపులకు చీరెలను అందచేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



బాపూజీనగర్, అరుంధతీనగర్, సబర్మతీనగర్ ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు చీరెలను పంపిణీ చేస్తున్న గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్

## మహిళాసాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**చిక్కడపల్లి జూన్ 26 ( ప్రభాతవార్త ) :** మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శ్రేయస్సు సంక్షేమ పథకంలో భాగంగా శుక్రవారం బాపూజీనగర్, అరుంధతీనగర్, సబర్మతీనగర్ ప్రాంతాలలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ ఆధ్వర్యంలో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, బబ్లూ, కుమార్, గోపాల్‌తో పాటు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజం, వైస్–చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉద్యోగులు

## మేర కుల ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్

**సైఫాబాద్, జులై 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మేర కులస్తుల ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పాల్గొని నూతనంగా 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేర కులస్తుల వెల్ఫేర్ అసోసియేషన్'ను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజం, వైస్–చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులందరిని ఒకే వేదికపైకి తీసుకురావడానికే ఈ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే బాధ్యతతో కూడుకున్న హక్కులను సాధించుకోవడానికి, ఉద్యోగస్తుల మధ్య సమన్వయంతో కూడుకున్న సహకారం అందించుకోవడానికి, భావితరాల మేర కులస్తులకు సమాచారం ఇవ్వడానికి, దిక్సూచిగా ఉండటానికి ఉపయోగపడుతుందన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక కమిటీ ప్రతినిధులుగా మారిశెట్టి నవీన్‌కుమార్, రుద్రదంగిక రమేష్, కొత్తకొండ సుజాత, ఒడపల్లి ప్రసూనరాణి, గూడూరు కిరణ్, ఒడెల నరేందర్, బుర్ర సాయిబాబా, కొక్కు వినోద్ తదితరులు ఎన్నికైనారని వారు వివరించారు. ఈ మేరకు మేర కులస్తులకు సంబంధించిన వెబ్‌సైట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి ప్రారంభించడం జరిగిందని వారు తెలిపారు.

### వర్షాకాల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రగతినగర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు నగేష్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వ అధికారులకు బహిరంగ లేఖ విడుదల చేశారు.వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, కూలిపోయే ప్రమాదం ఉన్న చెట్లను గుర్తించి తొలగించడం, రోడ్లపై గుంతలను పూడ్చడం వంటి చర్యలను తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అలాగే తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులకు అధికారిక వాట్సాప్ గ్రూపుల ద్వారా ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్లాట్ యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పించాలని కోరారు.కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో పరిశుభ్రత, పారిశుద్ధం, దోమల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి ప్రగతినగర్‌ను పరిశుభ్రమైన, సురక్షి తమైన, ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలని నగేష్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరెల పంపిణీ

**నిజాంపేట్, జూన్ 26, ప్రభాతవార్త:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి కౌసల్య కాలనీలో ద్వారక మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి జరుగుతోందని, ఇందిరమ్మ చీరల పంపిణీ మహిళల్లో ఆనందంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ద్వారక గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, యశోద, ఆర్.పీ. కరుణ, ఆర్.పీ. జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి రెడ్డి, స్థానిక మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




చీరెలు పంపిణీ చేస్తున్న కొలన్ హన్మంత్ రెడ్డి

### ఆర్‌పిఐ(ఏ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడి సతీష్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆర్‌పిఐ(ఏ) జాతీయ కార్యదర్శి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం శివనాగేశ్వర రావుగౌడ్ నియామక ఉత్తర్వులను అందచేశారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ సహాయమంత్రి, ఆర్‌పిఐ (ఏ) జాతీయ అధ్యక్షులు రాందీస్ అథవాలే ఆదేశాల మేరకు మేడి సతీష్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించటం జరిగిందని పేరం శివనాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ ప్రధాన శిల్పి, భారతరత్న డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ గారి ఆశయాలకు, ఆదర్శాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా సమానత్వం, సౌభ్రాతృత్వం సాధికారత విలువలను సమాజంలో మరింత బలోపేతం చేస్తూ, పార్టీ లక్ష్యాలు, ఆశయాల సాధనకు సతీష్‌కుమార్ అంకితభావంతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



నియామక ఉత్తర్వులను అందచేస్తున్న శివనాగేశ్వరరావు గౌడ్

### అంగన్‌వాడీలను గ్రేడ్-3, గ్రేడ్-4 ఉద్యోగులుగా గుర్తించాలి

**సైఫాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** అర్థశతాబ్దంగా ఐసిడిఎస్ పథకంలో విధులను నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను గ్రేడ్–3, గ్రేడ్–4 ఉద్యోగులుగా గుర్తించాలని, అలాగే 2013లో మే నెలలో జరిగిన 45వ ఐఎల్‌సిలో చేసిన సిఫార్సులలో స్కిం వర్కర్లందరిని కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా అంగన్‌వాడీ ఫెడరేషన్ నాయకురాలు డా.బి.వి.విజయలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి భవన్‌లో జరిగిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి సమావేశంలో ఆమె ప్రసంగించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, అసోసియేషన్ నాయకురాళ్ళు ఎన్.సాయీశ్వరీ, పి.ప్రేమ్‌పావని, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డా.బి.వి.విజయలక్ష్మి

## బాస్కెట్ బాల్ లీగ్‌లో వరంగల్ స్టాలియన్స్ సత్తా

**హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** తెలంగాణా జూనియర్ బాస్కెట్ బాల్ లీగ్‌లో వరంగల్ స్టాలియన్స్ అండర్ 14 బాలికల జట్టు ఫైనల్‌కు చేరింది. యూసఫ్‌గూడా లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో నిజాం రాయల్స్ జట్టును స్టాలియన్స్ మట్టి కరిపించారు. మొదటి క్వార్టర్ 20,7 స్కోరుతో అధిక్యతను ప్రదర్శించిన స్టాలియన్ బాలికలు అదే ఊపుతో నాలుగు క్వార్టర్లు వరకు కొనసాగించారు. ఆఖరిగా 62,38 స్కోరు తేడాతో అఖండ విజయాన్ని నమోదు చేసింది. నిజాం రాయల్స్‌కు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా జట్టు సభ్యులు సమన్వయంతో ఆడారు. సెమీ ఫైనల్‌లో అత్యున్నతమైన ప్రదర్శనకు గాను స్టాలిన్‌కు చెందిన తనీష ఉత్తమ క్రీడాకారిణిగా అవార్డు అందుకుంది. 29వ తేదీన ఫైనల్ పోటీ జరుగుతుంది.

# అందరి చూపూ సర్ వైపే..

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో అన్ని పార్టీల నేతలు అలర్ట్




గన్‌ఫౌండ్రిలో సర్ ప్రక్రియను పరిశీలించటానికి వెళుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తదితరులు



రసూల్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



ఫారాల పంపిణీలో పాల్గొన్న డీసీసీ చీఫ్ దీపక్ జాన్

**గోషామహల్, జూన్ 26ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్)కార్యక్రమం తొలి రోజు గన్‌ఫౌండ్రి డివిజన్‌లో జరుగుతున్న (సర్)ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పరిశీలించారు. శుక్రవారం గన్‌ఫౌండ్రి డివిజన్‌లో జరుగతున్న ప్రక్రియను ఎం.ఎల్.సి కొమరయ్య, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఐ.ఆర్ కన్వీనర్ వేముల అశోక్, బిజెపి ఎస్.ఐ.ఆర్ రాష్ట్ర ప్రధాన బృంద సభ్యులు బిజెపి ఓబిసి మోర్చ నేషనల్ సభ్యులు పెరిగ సురేష్,బిజెపి గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌లు పరిశీలించారు.ఈసందర్భంగా అధికారులు చేపడుతున్న ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం, బూత్ లెవల్ అధికారుల(బిఎల్‌వోలు)ద్వారా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణి, ఓటర్ల వివరాల సేకరణ తదితర అంశాలను నాయకులు పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒకరు సహకరించాలని పిలుపునిచ్చారు.

**పార్టీలకు అతీతంగా నిర్వహించాలి**

**కంటోన్మెంట్, జూన్ 26 ప్రభాతవార్త:** భారత ఎన్నికల కమీషన్ చేపడుతున్న ఎస్.ఐ.అర్.సర్వే రాజకీయ పార్టీలకు అతీతంగా చేపడుతున్న బి.ఎల్.ఓ.లకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని మహంకాలి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు బి.ఎన్.శ్రీనివాస్,రాష్ట్ర నాయకుడు బానుక మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఓటు గల్లంతు కాకూడదు : ఎమ్మెల్యే గణేష్**

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కమీషన్ ప్రారంభించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) క్యాంప్‌లను గురువారం 2వ వార్డులోని రసూల్‌పురలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ఓటు గల్లంతు కాకుండా చూసుకోవాలన్నారు. బి.ఎల్.ఏలు నెల రోజుల పాటు ప్రతి ఇంటికి వచ్చి అవగాహన కల్పిస్తారన్నారు. వార్డు 7లోని జయలక్ష్మి ్మ గార్డెన్స్ లో బూత్ లెవెల్ ఏజెంట్లులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**మృతుల పేర్లను తొలగించేందుకు సహకరించాలి**

**అడ్డగుట్ట, జూన్ 26 ప్రభాతవార్త:** ఓటర్ సవరణ ప్రక్రియ (ఎస్.ఐ.ఆర్) సర్వేలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటర్ నమోదులో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటర్ జాబితాలో తప్పుఒప్పులను సరి చేసుకొని, మృతి చెందిన వారి పేర్లను తొలగించేందుకు సహకరించాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అదం సంతోష్‌లు తెలిపారు.శుక్రవారం అడ్డగుట్టలో బి.ఎల్.ఓ,బిఎల్‌ఏలు నిర్వహించిన ఎస్.ఐ.ఆర్.సర్వేను వారు పర్యవేక్షించి ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎస్.ఐ.ఆర్.చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్, టీపిసిసి కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్,అడ్డగుట్టకు చెందిన కాంగ్రెస్ నేతలు గంట రాజుసాగర్, వై.కొమురమ్మ, సుదర్శన్, సంతోష్, భూపతి హరి, వై.రవి, మంద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనికేతన్ కాలనీలో ...**

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర డివిజన్ శ్రీనికేతన్ కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వో షేక్ అక్రమ్, బీఎల్‌ఏ సుదీర్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు జాబితాల పరిశీలనను సమీక్షి ంచి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, మరణించినవారి లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్యానికి ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ప్రేమ్ వెంకట కోటిరెడ్డి, దామోదర్ నాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో..**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 26, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణపై పార్టీ నాయకులు బ్లాక్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మహిళా బ్లాక్ అధ్యక్షరాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలతో శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గాభవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై పార్టీ నాయకులకు సలహాలు సూచనలు అందజేశారు. హోటల్ జాబితా సవరణలో నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని నమోదు విషయంలో నాయకులు ఓటర్లకు సహకరించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీ మీ డివిజన్లలో ప్రతి వ్యక్తి ఓటు నమోదయ్యేలా చూడాలని సూచించారు.

**చాంద్రాయణగుట్ట అసెంబ్లీలో..**

**చాంద్రాయణగుట్ట, జూన్ 26, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–ప్రత్యేక సమగ్ర సవరణ) గురువారం మొదలైయ్యింది. ఆ అసెంబ్లీ పరిధిలో శిక్షణ పొందిన బిఎల్ఒలు గత రెండు రోజులుగా ఇంటింటికి వెళ్ళి జాబితాలో పేర్లున్న ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారంలను అందజేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను జాబితాలోంచి తొలగించేందుకు ఈనెల 25 నుండి సర్ చేపట్టిన విషయం తెలిసిందే. చాంద్రాయణగుట్ట నియోజక వర్గం పరిధిలో సుమారు 305 పోలింగ్ కేంద్రాలలో దాదాపు 3.77 లక్షల ఓటర్లున్నారు. ఈ నియోజక వర్గ పరిధిలోకి చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్ సర్కిళ్లు వస్తాయి. 305 మంది ప్రభుత్వ ఉద్యోగలను ఒక్క పోలింగ్ స్టేషన్‌కు ఒక్క బూత్ లేవల్ ఆఫీసర్ (బిఎల్ఓ)లను నియమించారు. వీరి వెంట గుర్తింపు పొందిన తొమ్మిది రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్ఎలుగా పాల్గొనవచ్చు.

**సమన్వయ లోపం సరిదిద్దాలి**

**చిక్కడపల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 25నే సర్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ఇప్పటికి కూడా ఎన్యుమరేషన్ ఫారాలు అన్ని పోలింగ్ బూత్‌లకు సక్రమంగా చేరకపోవడంపై బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేష సాయి, అడిక్ మెట్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన సర్ ఫారాల పంపిణి కార్యక్రమం సందర్బంగా మాట్లాడారు.

**ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ప్రభుత్వం విఫలం**

**చిక్కడ్‌పల్లి, జూన్ 26 ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్షాళన, రాష్ట్రంలోని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ధ్వజమెత్తారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో సర్ ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభమై 48 గంటలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు శూన్యమని మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రవీణ్ రెడ్డిని కలిసి వినయ్ కుమార్ వినతిపత్రం అందజేశారు.

## పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలి

**కార్వాన్, జూన్26 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మత్తుపదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజంలో డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధి పురానాపుల్ నుండి కుల్సుమ్ పూరా పోలీస్ స్టేషన్ పరిధి జియాగూడ శ్రీరంగనాథ స్వామి ఆలయం వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్కొండ జోన్ అడిషనల్ డి.సి.పి కృష్ణ గౌడ్, కుల్సుంపురా ఏ.సి.పి వి.తిరుపతి, కుల్సుంపురా ఇన్స్పెక్టర్ రాములు, మంగళహాట్ ఇన్స్పెక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

**సర్దార్ పటేల్ నగర్ నుండి ర్యాలీ...**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 26, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ నగర్ నుండి నిజాంపేట్ మెయిన్ రోడ్ వరకు శుక్రవారం డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఇనుమాటిక్స్ ఏఐ కోచింగ్ సెంటర్ సహకారంతో నిర్వహించగా సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
ర్యాలీలో మత్తు వద్దు, మంచి భవిష్యత్తు ముద్దు, డ్రగ్స్‌కు నో చెప్పండి, జీవితానికి అవును చెప్పండి, మత్తు రహిత భవిష్యత్తును ఎంచుకోండి అనే సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్, డిఐ కెపిహెచ్‌బి కాలనీ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మంగళ్‌హాట్ పోలీసుల ఆధ్వర్యంలో ...**

**గోషామహల్,జూన్ 26ప్రభాతవార్త:** సమాజంలో నేటి యువత డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని గోల్కొండ జోన్ డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీసు కృష్ణగౌడ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మత్తు పదార్దాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ్‌హాట్ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన భారీ అవగాహన ర్యాలీని గోల్కొండ జోన్ డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీసు కృష్ణగౌడ్ ప్రారంభించారు. కుల్సుంపురా అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు తిరుపతి ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్ర, రాములు, ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బంగారు భవిష్యత్తును నిర్మించుకోండి: ఏసిపి రణవీర్‌రెడ్డి**

**చిక్కడ్‌పల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చిక్కడ్‌పల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ జి. రణవీర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన సభలో ఏసీపీ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు శ్రీ వి. నాగభూషణం, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు శ్రీ ఎస్. మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ శివకిరణ్ సేవలు చిరస్మరణీయం

**నాంపల్లి, జూన్ 26 ప్రభాతవార్త :** ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్, సుకుకి ఎక్స్‌నోరా, జియోమ్యాప్ సొసైటీల వ్యవస్థాపకుడు మేజర్ జి.శివకిరణ్ మరణంపట్ల ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ ఛైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రఖ్యాత సామాజిక సేవకుడైన మేజర్ శివకిరణ్ స్థిరమైన వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడం, చెత్తఏరుకునే కార్మికుల (రాగ్‌పికర్స్) పునరావాసం సంక్షేమం కోసం కృషిచేయడం, హైదరాబాద్‌లో పౌరమౌలిక వసతుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషిచేయడం ద్వారా విశేష గుర్తింపు పొందారు. శివకిరణ్‌తో తనకు చిరకాల అనుబంధముందని, పర్యావరణం, పౌర సంక్షేమానికి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో కలిసి పనిచేసే సదావకాశం ఎఫ్‌బిహెచ్‌కు లభించిందన్నారు. మేజర్ జి.శివకిరణ్ కుటుంబ సభ్యులకు ఎఫ్‌బిహెచ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని వేదకుమార్ పేర్కొన్నారు.

## పాతబస్తీలో బోనాల జాతరకు సన్నాహాలు

**చార్మినార్,జూన్ 26 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చనున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మల్యాల మధుసూధన్ యాదవ్ తెలిపారు.దూద్‌బౌలిలోని మహరాజ్‌గంజ్ శ్రీ పోచమ్మ దేవాల యం కమిటి ప్రతినిధులు శుక్రవారం చైర్మన్ మధుసూధన్ యాదవ్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించారు.మహరాజ్ గంజ్ శ్రీ పోచమ్మ దేవాలయానికి బోనాల జాతర ఉత్సవాలు సందర్బంగా దేవాదాయ శాఖ నుంచి ఎక్కువ నిధులు మంజారు చేయాలని దేవాలయం కమిటి ప్రతినిధులు చైర్మన్ మధుసూధన్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహరాజ్ గంజ్ శ్రీ పోచమ్మ దేవాలయం కమిటి అధ్యక్షులు సుంకరి హనుమం తరావు, సంఘ సేవ కులు, సీనియర్ టిడిపి నాయకులు రవీందర్ గౌడ్,దేవాలయం కమిటి కార్యదర్శి బి.శ్యాంసుందర్, కార్యదర్శి ఆర్.మ హేందర్‌తో పాటు పలువురు దేవాలయం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## జివిఆర్ కరాటే అకాడమీ సరికొత్త రికార్డు

### 36 సెకన్లలో ఆరుగురు విద్యార్థుల తలలపై ఆపిల్స్ బ్రేక్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్బంగా జివిఆర్ కరాటే అకాడమీ సరికొత్త రికార్డు సాధించినది.36 సెకన్లలో ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను జి.ఎస్.గోపాల్ రెడ్డి బ్రేక్ చేశాడు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో నిర్వహించిన సరికొత్త రికార్డును విజయ వంతంగా పూర్తిచేశాడు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు జి.ఎస్.గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనలో భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ అనే ఆరుగురు విద్యార్థులు ధైర్యంగా తమ తలలపై ఆపిల్స్ ఉంచుకుని రికార్డు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్బంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమణగౌడ్,కాచిగూడ మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్,బిజెపి సీనియర్ నాయకుడు కన్నె రమేష్‌యాదవ్,వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకుడు కోట్ల నిరంజన్ రెడ్డి,జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొని డాక్టర్ జి.ఎస్.గోపాల్ రెడ్డి,విద్యార్థులను అభినందించారు.

## మూసీలో మట్టి నింపుతుంటే ఎందుకు మిన్నకున్నారు ?

**నార్సింగి, జూన్ 26 ప్రభాతవార్త :** పాఠశాల నిర్వాహకులు భూ యజమానులమైన మాతో చేసుకున్న అగ్రిమెంట్‌ను, జిహెచ్ఎంసి, ఇరిగేషన్ శాఖల నిబంధనలు ఉల్లంఘించారని రాష్ట్ర ముదిరాజ్ కార్పొ రేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూ డలోని తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంను నిర్వహించి, గండిపేట మండలంలోని మంచిరేవులలో రెవెన్యూ అధికా రులు కూల్చి వేసిన అక్రమ నిర్మాణాలు, పాఠశాలకు చేసిన అగ్రిమెంట్‌ల విషయంలో తనపై వస్తున్న తప్పుడు ఆరోపణలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిరేవుల సర్వే నెంబర్లు 328,329లలో మాకు 30.గుంటల పట్టా భూమి ఉందని, ఈ భూమిలోనే పాఠశాల నిర్వహించుకోవాలని తాము అగ్రిమెంట్ చేశామని తెలిపారు.
కానీ సదరు పాఠశాల నిర్వాహకులు ఇటీవల మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పక్కనే ఉన్న మూసీ బఫర్ జోన్, దేవాదాయ శాఖలకు చెందిన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా తాత్కాలిక షెడ్లను నిర్మించుకున్నారన్నారు.
ఆ సమయంలో మా కుమారుడు అక్కడికి వెళ్లి ఈ నిర్మాణాలు చేయవద్దని సూచించినా పట్టించుకోలేదన్నారు. దీంతో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులకు సదరు అక్రమ నిర్మాణాలు తొలగించాలని మేమే ఫిర్యాదు చేశామని వివరించారు. రేయింబవళ్లూ పెద్ద ఎత్తున మూసీ బఫర్ జోన్‌లో మట్టిని నింపుతుంటే తహసీల్దార్ ఎందుకు మిన్నకున్నారని ప్రశ్నించారు.

## విద్యుత్ భద్రతకు సురక్షా చిట్కాలపై అవగాహన

**హైదరాబాద్,జూన్ 26,ప్రభాతవార్త:** జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని, ఫైర్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సెమినార్‌ను నిర్వహించారు. దీనికి తెలంగాణ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ గౌరవ అతిథిగా హాజరై, విద్యుత్ భద్రతపై విజ్ఞానదాయకమైన ప్రసంగం చేశారు. విద్యుత్ ప్రమాదాలతో ముడిపడి ఉన్న ముప్పులు పెరుగుతున్నాయని హైలైట్ చేస్తూ, భద్రతా పద్ధతులను బలోపేతం చేయడానికి, అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల నిపుణులు, విద్యుత్ నిపుణులు ,పౌరుల సమిష్టి కృషి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సందర్బంగా, ప్రజలలో సురక్షిత విద్యుత్ పద్ధతులు,నివారణ చర్యలపై అవగాహన కల్పించేందుకు, డీజీఎఫ్ఎస్ విద్యుత్ భద్రతపై సురక్షా చిట్కాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణను బలోపేతం చేయడానికి, భద్రతా అవగాహనను ప్రోత్సహించడానికి, సురక్షితమైన విద్యుత్ వ్యవస్థను సృష్టించి, ప్రాణాలను, ఆస్తులను రక్షించడానికి భాగస్వాములందరితో కలిసి పనిచేయడానికి తెలంగాణ అగ్నిమాపక సేవలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కె. నంద కుమార్, మరియు తెలంగాణ ఆర్ బి శాఖ చీఫ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) లింగారెడ్డి, ఎఫ్ఎస్ఏఐ జాతీయ అధ్యక్షుడు దీపెన్ మెహతా, అమోల్ కల్సేకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కవితా మాలికను ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

## అనంతం గోపి కవిత్వ సారాంశం

**రవీంద్రభారతి, జూన్ 25 ప్రభాతవార్త :** డా. ఎన్.గోపి నిజమైన సహజసిద్ధ కవి అని ఆయన కవిత్వంలో సారాంశం అనంతమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. గోపి తన పుట్టినరోజు సాహిత్యపరంగా సాహితీమూర్తుల మధ్య జరుపుకోవడం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. కవిత్వమెంతో గొప్పది... మళ్లీ జన్మంటూ ఉంటే కవిగానే పుట్టాలనుందని వ్రాయడం కవితాభిమానానికి మచ్చుతునకన్నారు. పుస్తకంమీద వేసిన చిత్రం ఏ ఉద్దేశంతో వేసినా చాలా అందంగా, అందరికీ ఆమోదయోగ్యంగా, ఆహ్లాదకరంగా పుస్తకానికి మరెంతో ఆకర్షణను చేకూర్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం రాత్రి డా. ఎస్.రఘు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు ప్రముఖకవి ఆశారాజు, డా. గిన్నారపు ఆదినారాయణ, కుడికాల వంశీధర్, ప్రొఫెసర్ జె.నీరజ, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి సుప్రసిద్ధ కవి డా. ఎన్.గోపి రచించిన రెప్పలు దాటని లోకం కవితా సంపుటిని ఆవిష్కరించి ప్రముఖ కవి ఆశారాజు దంపతులను ఘనంగా సత్కరించి తొలిప్రతిని అందజేసి అంకితోత్సవం కావించారు. సభకు మద్దాళి రఘురామ్ స్వాగతం పలుకగా మిగతా అతిథులు ప్రసంగించారు.

## సాంస్కృతిక వైభవాన్ని చాటిన తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవం తెలంగాణ ప్రజాకళ గత మూడురోజులుగా చారిత్రాత్మక నాటక ప్రదర్శనలతో సుసంపన్నమవుతూ అశేష ప్రేక్షక ఔత్సాహికులను రంజింపజేస్తోంది. అనువోజు వెంకటేష్ బృందంచే 84వ రోజు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాముల చరిత్ర పౌరాణిక పద్యనాటకం, 85వ రోజున తిరుపతి వేంకటకవులు రచన, శ్రీ చౌడేశ్వర నాట్యమండలి నటీనటుల సుప్రసిద్ధ పౌరాణిక పద్యనాటకం శ్రీకృష్ణరాయబారం నారాయణస్వామి, సాల్వాచారి, మల్లాది వెంకటరమణ, మూర్తి తదితరుల అద్భుత నటనతో భక్తిరసాన్ని పండించగా, 86వ రోజు డా. సంఘనభట్ల నరసయ్య రచన దర్శకత్వంలో దత్తాత్రేయశర్మ, నరసయ్య, సూర్యనారాయణమూర్తి, భానుప్రకాష్, గౌరీశంకర్‌శర్మ, సరస్వతి రామశర్మ, త్రిగుళ్ళ హాసిని తదితరుల అద్భుత నటనతో శ్రీ ప్రతాపరుద్ర విజయం చారిత్రక రూపకం మన చారిత్రిక సాంస్కృతిక వారసత్వాన్ని నేటితరానికి అందించింది. తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు నర్సింలు, దినకర్, డా. విజయ్‌కుమార్ తదితరులతో కలిసి నాటక కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. విద్యానందచారి, శ్రీనివాసరాజులు తమ వ్యాఖ్యానంతో రంజింపజేశారు.

## సెల్ డ్రైవింగ్ హెల్

(మొదటి పేజీ తరువాయి)

భూపాలపల్లి డీటీఓ వెంకన్న తన కార్యాలయం ముందు వాహనాలను తనిఖీ చేస్తుండగా, మితిమీరిన వేగంతో వచ్చిన బొగ్గు లారీ డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే దుర్ఘటన జరిగినట్లు విమర్శలు వినవస్తున్నాయి. ఒక నిండు ప్రాణాన్ని సెల్‌ఫోన్ మృత్యు ఒడికి చేర్చి, ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్న నేపథ్యంలో ఆర్‌టీఏ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతం**

జంట నగరాలలోని ప్రధాన రోడ్లపై కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతమవుతున్నాయి. కొందరు ఆక్రమణ దారులు ఎంతో ధీమాగా వాటిపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దుకాణాలు ఒకచోట ఉంటే, తమ వ్యాపార వస్తువులను ఫుట్పాత్‌లు, రోడ్లపైకి విస్తరిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్, రోడ్డు అనే తేడా లేకుండా కనుమరుగవుతున్నాయి.
పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను సంరక్షి ంచాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్టు) పలుమార్లు ఆదేశించినా, అధికారులు ఆ బాధ్యతలను సంపూర్ణంగా నిర్వహించడం లేదు. పైగా రకరకాల రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనుకంజ వేస్తుండటంతో ఆక్రమణలు మరింత ఊపందుకుంటున్నాయి. ఇటీవల చార్మినార్ పోలీసులు కొంత మంది అక్రమ వ్యాపారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిం చారు. ఇలాంటి కఠినమైన చర్యలు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం జరగాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆక్రమణలకు శిక్షలుంటాయనే భయం వెంటాడుతుంది మరియు గుడ్డిలో మెల్లలా కొంతవరకైనా ఫుట్పాత్‌లు, రోడ్ల ఆక్రమణలను నియంత్రించవచ్చు. దీనికి తోడు రాంగ్‌రూట్ వాహనాలు ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. సవ్య దిశలో వెళ్లాల్సిన వారు అపసవ్య దిశలో ప్రయాణిస్తూ తీవ్ర అసౌకర్యానికి కారణమవుతుండగా, ట్రాఫిక్ పోలీసులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అంతేకాకుండా, ద్విచక్ర వాహనాలకు వెనుక ఉండే నంబర్ ప్లేట్‌ను తొలగించి లేదా ఒక డిజిట్‌ను చెరిపేసి ట్రాఫిక్ పోలీసుల ఇఛాలాన్ల నుండి తప్పించుకుంటున్నారు.
రోడ్డుపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ప్రస్తుతం సాధారణ స్పెషల్ డ్రైవ్‌లకు స్వస్థి చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ముందస్తుగా నిర్ణయించుకున్న కీలక ప్రాంతాలలో మాటు వేసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలే లక్ష ్యంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు ద్విచక్ర వాహనాలను పట్టుకుంటున్నారు. ఆదాయ మార్గంగా ఉన్న భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్‌ను ఆపి పాత చాలాన్లను వసూలు చేస్తూ ట్రాఫిక్ విభాగం ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా ధరలను పెంచకుండా, తెలివిగా దొడ్డిదారిన ఛాలాన్ల వసూళ్లను ఆదాయ మార్గంగా ఎంచుకుందనే విమర్శలు వస్తున్నా, ట్రాఫిక్ పోలీసులు మాత్రం దీనిని తమ విధుల్లో భాగంగా చేసుకున్నారు. ఎక్కువ మంది పోలీసులు వసూళ్లలోనే పడటంతో సిగ్నల్స్, బాటిల్ నెక్స్, కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ కరువైంది. కొన్ని కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ఎవరినీ పట్టించుకోవడం లేదు. ఫోన్లలో తీరిక లేకుండా గడుపుతున్నారు. దీంతో కొందరు వాహనదారులు సిగ్నల్స్ జంప్ చేయడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ నియమాలు పద్ధతిగా పాటించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 184 ప్రకారం ఏదైనా మోటారు వాహనం నడుపుతున్నప్పుడు చేతిలో మొబైల్ ఫోన్ వినియోగించడం తీవ్రమైన నేరం. మొదటి నేరానికి: రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు పడుతుంది.

## నీట్ ఎస్ఎస్ కౌన్సిలింగ్ పూర్తి చేయాలి

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త :** నీట్ ఎస్ఎస్ 2026 కౌన్సెలింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆర్‌డీఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.మార్చి నుంచి కౌన్సెలింగ్ పలుమార్లు వాయిదా పడడంతో దేశవ్యాప్తంగా వేలాది మంది వైద్యులు మానసిక, ఆర్థిక, వృత్తిపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. సీట్లు ఖాళీగా ఉండటం వల్ల బోధనా ఆసుపత్రుల్లో వైద్య సేవలపైనా ప్రభావం పడుతోందని తెలిపింది. అనవసర జాప్యం లేకుండా మిగిలిన కౌన్సెలింగ్‌ను పూర్తి చేసి, స్పష్టమైన షెడ్యూల్‌ను విడుదల చేయాలని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖను ఆర్‌డీఏ విజ్ఞప్తి చేసింది.

## అసభ్యంగా ప్రవర్తించిన ఫిజియోథెరపిస్ట్‌పై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 26, ప్రభాతవార్త :** ఫిజియోథెరపీ చికిత్స పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేర కు జూబ్లీహిల్స్ ఠాణాలో ఒక ఫిజియోథెరపిస్ట్‌పై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మోకిలలోని ఓ ఫిజియోథెరపీ క్లినిక్‌లో గతేడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు ఒక మహిళకు భుజం నొప్పి కోసం ఫిజియోథెరపిస్ట్ సునీల్ కుమార్ రేలంగిని సంప్రదించారు. చికిత్స పేరుతో అసభ్యంగా తాకడమే కాకుండా, తన అనుమతి లేకుండా కౌగిలించుకుని ముద్దుపెట్టు కున్నాడని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## 49 మందికి సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**సికింద్రాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను గుర్తించి వివిధ పథకాలను ప్రవేశ పెట్టిందని, పేదలకు ఉపకరించే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసే మొత్తాన్ని పెంచి వారిని ఆదుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 49 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సేవలకు మంజూరైన చెక్కులను సీతాఫలమండీ క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ శుక్రవారం పంపిణీ చేశారు. బీ.ఆర్.ఎస్. యువనేత రామేశ్వర గౌడ్, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

IN COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MALKAJGIRI
O.S.NO. 319 OF 2026

Between :
**K. Venkateshwarlu** S/o. Late K. Pentaiah @ Laxmaiah, Aged about 46 years, Occ: Pvt. Employee. R/o. H.No.4-7-8/104, Bharat Nagar, Kowkoor, Alwal, Medchal-Malkajgiri District - 500 010. ...Plaintiffs
AND
1. The Tahsildar, Malkajgiri.
2. All Concerned ...Defendants
To
All concerned ...Defendant No.2

Whereas the plaintiff has instituted the above suit to declare the Plaintiff as only surviving legal heir of Late Smt. Kanveti Devamma W/o. Late Kanveti Pentaiah @ Laxmaiah, who died intestate on 14-05-2025, consequently entitled to succeed schedule property.

SCHEDULE OF PROPERTY

All that House bearing Municipal No.4-7-8/104, Plot bearing No.104, in Sy.No.29, admeasuring 165 Sq.Yds., or 137.9 Sq.Mts., (covered under ward No.4, and Block No.2) situated at Samala Laxmi Enclave, Kowkoor Village, Under GHMC, Alwal Circle, Malakgiri Mandal, Medchal-Malkajgiri District (erstwhile R.R.District) and bounded on : NORTH : Plot No.105; SOUTH: Plot No.103; EAST : Plot No.143; WEST : 25" Wide Road.

You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the **08-07-2026, at 10.30 a.m.** in the to answer claim and of your defense and to produce on said day all documents in your possession or power upon which you base your defence. Take notice that in default of your appearance on the day before mentioned the suit will beheard and determined in your absence as exparte.

// BY ORDER OF THE COURT //
**D. NAGESHWARI**
**ADVOCATE**
# Flat No.403, 4 th Floor Bramareswari Sai Nilayam, Fathullaguda, Bandlaguda, Nagole, M.M.District-068. Cell: 9849664378
Counsel for Petitioner/Plaintiff

**PUBLIC NOTICE**

General Public are hereby informed that my Client **Sri VILLA VISWESWARA RAO** S/o. Balakrishna Villa, R/o. H.No. 48-525/2, Qutbullapur, Chintal, Hyderabad - 500 054. T.S. has enterd into an Agreement of Sale for the purchases of All that the House Bearing No. Old 19-114/4, and New No. 17-28/1 on Plot No. 102 and 103 admeasuring 532.0 Square Yards or equivalent to 445.8 Square Meters, Situated at Ramnagar, Alwal, Malkajgiri, T.S. with its Owner S. BALBINDER SINGH S/o. Sri Sarwan Singh and S. Sathpal Singh, S/o. Sarwan Singh, R/o. H.No. 17-28/1, Ramnagar, Alwal, Malkajgiri, T.S. and paid advance sale consideration amount.
If any person(s) are having any claim, right, interest or objection or custody of any deeds or documents pertaining over the above said property and transaction, may contact the undersigned alongwith all original relevant documents to substantiate their claim, within Fifteen (15) Days from the date of this publication, thereafter no claims or objections are entertained, and my Client proceed further to complete the sale transaction.

**MOHAMMED IBRAHIM ALI**
**Advocate**
Office at 10-1-595, Chintalbasti Main Road, Khairatabad, Hyderabad.
**Cell : 9396565627**

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R.R DISTRICT AT:- MEDCHAL
O.S. No. 417 OF 2026

BETWEEN:-
**Sunkari Andalu & Others** ...Plaintiffs
And
**The Tahsildar, Medchal & All Concerned ...Defendants**
To,
**THE TAHSILDAR MEDCHAL & ALL CONCERNED**

Please take notice that the above-named Plaintiffs have filed the above suit against All Concerned and others for Declaration & others reliefs in the above court and the above said suit is posted on **03-08-2026 at 10:30 AM** for your appearance either in person or through an advocate, failing which the case will be decided in your absence as per law.

"By order of Hon'ble Court"
**Sd/- M.RAGHAVENDER REDDY**
**ADVOCATE**
H.No.5-65/1, Poodur Village, Medchal Mandal, Ranga Reddy District-501401.
**Mobile No. 9963027515.**

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-IX ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT MEDCHAL
O.S.No. 359 of 2026

Between:-
Parcha Ram Kishan @ Parcha Ram Krishna & Others ...Petitioners/Plaintiffs
And
The Tahsildar, Quthbullapur Mandal & Another ...Respondents/Defendants

NOTICE

To
All concerned

Please take notice that the Plaintiffs in the suit in O.S.No.359 of 2026 of Hon'ble II Addl. Junior Civil Judge-Cum-IX Addl. Judicial Magistrate of First Class, At Medchal, has filed suit for declaration to declare the Plaintiffs as legal heirs of deceased, Smt. Parcha Vimala Devi @ Parcha Bimala Devi against the Respondents / Defendants herein and the above suit is posted to 06-07-2026 at 10.30 A.M. for your appearance and answer.
Therefore, you are hereby requested to appear in the above said suit proceedings either in person or through an advocate on 06-07-2026 at 10.30 A.M., before the above Hon'ble Court otherwise the matter will be decided in your absence as per law.

// BY ORDER OF HON'BLE COURT //
**P.Swaroopa**
**Advocate**
O/o Plot No.94 KLR NJR Nagar, Medchal Locality Medchal-Malkajgiri District-501401

## ఉత్సవాలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి

: టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్



గడ్డి అన్నారం లోని అషర్ ఖానాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మలక్ పేట, జూన్ 26,ప్రభాతవార్త:** ఉత్సవాలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గడ్డిఅన్నారం లోని అషుర్ ఖానలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్, లింగాల శివకుమార్ గౌడ్, కొప్పుల నాగిరెడ్డి, ఫెరోస్, అజ్మల్, అఫ్రోజ్, బిల్డర్ శివకుమార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: చౌకి రవికుమార్



ఓల్డ్ మలక్ పేటలో పహిల్వాన్ దర్గాలో పిర్లకు దట్టిలను సమర్పిస్తూన్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, జూన్ 26,ప్రభాతవార్త:**
ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌకి రవికుమార్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేటలో పహిల్వాన్ దర్గాలో పలువురు నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన పిర్లకు దట్టిలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ శ్యామ్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఆయుబ్, నిసార్, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## యోనెక్స్-సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం



**నేరేడ్‌మెట్, జూన్ 26,ప్రభాతవార్త :**
హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణికొండలోని అదిరా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా జూన్ 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న యోనెక్స్-సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ (అండర్19) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కానూరు వంశీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, "క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం. విజయంతో గర్వపడకుండా వినయంతో ఉండాలి. ఓటమిని అపజయంగా కాకుండా విజయానికి పునాదిగా భావించి మరింత కృషి చేయాలి. క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల ప్రతి క్రీడాకారుడిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయి. ప్రతి పోటీ ఒక కొత్త అనుభవాన్ని, కొత్త పాఠాన్ని నేర్పుతుంది. రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకొచ్చే క్రీడాకారులుగా ఎదగాలని యువత లక్ష్యంగా పెట్టుకోవాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో అదిరా బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు శిఖరం శ్రీనివాస్, శిఖరం సౌమ్య, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ ఎల్. రవికుమార్, అబ్జర్వర్ పీ. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగులంతా ఐకమత్యంతో ఉండాలి



**మన్సూరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:**
పద్మశాలి లోని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి అని తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏవగందల రాహుల్ కుమార్ పేర్కొన్నారు. మన్సూరాబాద్ లోని ఓ భవనం లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాహుల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ కుల సంఘానికి చెందిన పేద విద్యార్థుల కోసం స్కాలర్ షిప్ లను అందిస్తూ తమ సంఘం నాయకులు ముందుకు వెళ్ళడం సంతోషంగా ఉందని అన్నారు. అదే విధంగా ఉద్యోగులు అందరూ ఐకమత్యం తో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమనీకి సభ అధ్యక్షులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు వ్యవహరిస్తూ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేసింది అన్నారు. అదే విధంగా చదువు లో పూర్తి మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సకాలు అందజేయడం జరిగింది అన్నారు. రాష్ట్రం లో తమ సంఘం పూర్తి స్థాయిలో విస్తరించే దిశగా కృషి చేస్తామన్నారు. తమ సంఘం నిరుపేద పద్మశాలీలకు సైతం అండగా ఉంటామని తెలిపారు. ముఖ్యంగా చేనేతలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి గా బొజ్జల గంగయ్య, కోశాధికారి అలె బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి టి యాదగిరి, ఉమ దేవి, సుజాత, రామ్మోహన్, రాజేశం పాల్గొన్నారు.



పీ వి ఎన్ కాలనీ మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ఆఫీస్ కార్యాలయంలో బిఎల్వోలు ప్రేమ్ కుమార్‌కు ఎస్ ఐ ఆర్ ఫామ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సంపత్ రావు, శంకర్ రావు తదితరులు ఉన్నారు

# మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**తుర్కయంజాల్, జూన్ 26 (ప్రభాతవార్త)**
మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి, సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హురాలికి చేరేలా ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మన్నెగూడలోని జేఎంఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు, అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. అందుకే మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు సుస్థిరంగా నిలుస్తాయని, గ్రామాల అభివృద్ధికి కూడా అది దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని, కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ప్రభుత్వం అందజేసిన ఇందిరమ్మ చీరలను ఆనందంగా స్వీకరించి హర్షం వ్యక్తం చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొంటూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు కోశిక ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ గండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు సామ భీం రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కాకుమాను సునీల్, కొంతం వెంకట్ రెడ్డి, మేతరి దర్శన్, మెప్మా యూసీడీ అశ్వినీ, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# సీట్లు పూర్తిగా భర్తీ.. నో అడ్మిషన్స్ బోర్డుకు సిద్ధం

**-మూడేళ్లలో 360 నుంచి 600కు చేరిన ప్రవేశాలు**

**-త్వరలో నో అడ్మిషన్స్ బోర్డు ఏర్పాటు - ప్రిన్సిపాల్ బండి రాజు**



**నేరేడ్‌మెట్, జూన్ 26,ప్రభాతవార్త :**
నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్న మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరో మైలురాయిని చేరుకుంది. దోస్త్ మూడో దశ సీట్ల కేటాయింపుతో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాలు వంద శాతం పూర్తయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న మొత్తం 600 సీట్లు పూర్తిగా భర్తీ కావడంతో త్వరలో కళాశాల ప్రాంగణంలో "నో అడ్మిషన్స్" బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు చూపుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా కళాశాలలో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. 2024లో 360 సీట్లు భర్తీ కాగా, 2025లో ఆ సంఖ్య 499కు చేరిందని, 2026లో ఏకంగా 600 సీట్లు పూర్తిగా నిండడం విశేషమన్నారు. నాణ్యమైన విద్యా బోధన, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి చేపడుతున్న కార్యక్రమాలు ప్రవేశాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయని వివరించారు. వంద శాతం ప్రవేశాలు పూర్తికావడం కళాశాల చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టమని, దీనికి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సమిష్టి కృషే కారణమని ప్రొఫెసర్ బండి రాజు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తూ విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పించేందుకు కళాశాల కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా ప్రక్రియ : ఎం.రజితరెడ్డి



ఉప్పల్ డివిజన్‌లో ఓటర్ల ఫారం పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని, సర్ కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సర్ కార్యక్రమాన్ని పలువురు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారుతుందన్నారు. సర్ తో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి, మహేష్‌గౌడ్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని సూచించారు. ఉప్పల్ డివిజన్ లో ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా బిఎల్ఒలు అందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఓటర్ల సవరణ లేదా నమోదు ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మనం సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ సీనియర్ నేతలు ఈగ ఆంజయ్య, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, గొరిగె కృష్ణ, రావుల బాలకృష్ణగౌడ్, ఏమాండ్ల రాంరెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, జనగాం రామకృష్ణ, సురేష్, లక్ష్మణ్, బాల్‌రాజ్, అశ్విని, మహంకాళి రాజు, రంగుల శేఖర్, ప్రశాంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నాగూర్ భాష, విజయ్, పావని, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్ ఘనంగా జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలు

**-నేడు శాస్త్రోక్తంగా బొడ్రాయి ప్రతిష్ట జరుపనున్న పురోహితులు**



ప్రతిష్టించనున్న బొడ్రాయికి జలాధివాసం పూజలు చేస్తున్న బాలాపూర్ గ్రామ మహిళలు

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని చారిత్రక బాలాపూర్ గ్రామంలో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్టాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. గ్రామ ప్రజల సహకారంతో బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. పురోహిత రత్న, కోటి దీపోత్సవ పురోహితుడు రేవల్లి రాజు శర్మ, సభాపతి నరహరి శర్మ, బైండ్ల పూజారులు ఇంద్రపల్లి ముత్యాలు, ఏదుల్ల గౌరీ శంకర్‌ల ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్టాపన క్రతువు పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు గురువారం సాయంత్రం బొడ్రాయి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో బొడ్రాయిని ఊరేగించగా ప్రతి ఇంటి ముందు గ్రామ మహిళలు నీళ్ళతో సాకపట్టి కొబ్బరి కాయలు కొట్టి మంగళ హారతులు, పసుపు, కుంకుమలతో స్వాగతం పలికారారు. శుక్రవారం గణపతి హోమం, యాగ మంటప హోమాలు జరిపి బొడ్రాయికి విశేష జలాధివాస కార్యక్రమాన్ని కన్నుల పండువగా చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుండి బిందె నీటితో వచ్చిన మహిళలు బొడ్రాయికి జలాధివాసం చేశారు. మధ్యాహ్నం సమయంలో బొడ్రాయికి ధాన్యాధివాసం చేసి హారతి, మంత్ర పుష్ప నీరాజనం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బియ్యం, కొబ్బరి కుడుకలు, జొన్నలు, గోధుమలు తదితర ధాన్యాలను బొడ్రాయి ధాన్యాదివాసం కోసం సమర్పించారు. సాయంత్రం బొడ్రాయికి శయ్యాధివాసం చేయగా గ్రామ ప్రజలు పండ్లు, పూలు, గాజులు, తిలకం, వస్త్రాలు సమర్పించారు. బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా బాలాపూర్ గ్రామ పెద్దలు, గ్రామ మాజీ పోలీస్ పటేల్, సరూర్‌నగర్ మాజీ ఎంపిపి సామల రంగారెడ్డి హాజరై బొడ్రాయి జలాధివాసం, హోమ పూజల్లో పాల్గొన్నారు.

**నేడు బొడ్రాయి ప్రతిష్ట**

ఉత్సవాల్లో కీలక ఘట్టమైన బొడ్రాయి ప్రతిష్ట శనివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామున హోమాలు జరిపి 108 మృతికా కలశాలతో మహాస్నపణ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఉదయం 7.38 గంటల సమయంలో బొడ్రాయి యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట జరిపిన అనంతరం మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం చేస్తారు. అయితే బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా బాలాపూర్ గ్రామంలోని ఇళ్లు సందడిగా మారాయి. ఆడ పడుచులతో ఇళ్ళకు కొత్త శోభ వచ్చింది. బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా శనివారం రాత్రి 8 గంటల నుండి మరుసటి రోజు ఆదివారం తెల్లవారు జామున 5 గంటల వరకు శాస్త్రం ప్రకారం గ్రామ బంధనం విధిస్తారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో గ్రామంలో ఉన్న వారు బయటకు, గ్రామం బయట ఉన్న వారు లోపలికి రాకూడదని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి బొడ్రాయి బోనాల మహోత్సవం ఉంటుందనీ ఈ సందర్భంగా బోనాల ఊరేగింపు, బొడ్రాయికి సమర్పణ చేస్తారు.

## ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

**హయత్ నగర్, జూన్ 26 ప్రభాతవార్త :**
ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్ నగర్ శివం హిల్స్ కు చెందిన కొకుంట్ల శ్రీనివాస్ కుమార్తె మేఘన(21) మెహదీపట్నంలోని సెయింట్ ఆంటోనీ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈనెల 26న ఉదయం 9:30 గంటల సమయంలో స్నానం చేస్తానని చెప్పి బెడ్ రూమ్ లోకి వెళ్లి డోర్ వేసుకుంది. గంటసేపయినా మేఘన బయ టికి రాకపోవడంతో తల్లి దండ్రులు డోరు కొట్టారు. లోపలి నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి బెడ్రూమ్ కిటికీ అద్దాలు పగలగొట్టి చూశారు. మేఘన బెడ్ రూంలో సీలింగ్ ఫ్యాన్ కి చున్నీతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు బెడ్ రూమ్ డోర్ పగలగొట్టి ఆమెను కిందికి దింపి దగ్గరలోని సన్రైజ్ హాస్పిటల్ తీసుకుని వెళ్లారు. అక్కడ డ్యూటీ డాక్టర్లు మేఘనను పరీక్షించి అప్పటికే ఆమె చనిపోయినదని నిర్ధారించారు. మేఘన మరణానికి కారణాలు తెలియరాలేదు. మేఘన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు కవిత సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో చేరికలు

**నేరేడ్ మెట్ జూన్26,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో నేరేడ్ మెట్‌కు చెందిన పిట్ల విజయలక్ష్మి నేతృత్వంలో 500 మంది మహిళలు, యువకులు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో చేరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటలకు మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరేడ్మెట్ చౌరస్తాలో భారీ చేరికల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సేన సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎస్ఐఆర్ ఇంటింటి సర్వే.. ప్రజా సమస్యలపై నాయకుల దృష్టి



బిజేపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కు సర్ దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ పరిధిలోని ఎస్ఐఆర్ బూత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. బూత్ స్థాయిని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఈ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని ప్రతి ఇంటిని సందర్శించారు. స్థానికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల లోపాలపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండెల్లి మధుకర్, సాయికుమార్, బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు జోగు రాకేష్, బీజేపీ నాయకులు సుబ్బారావు, కౌశిక్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కాలనీల అభివృద్ధికి అన్ని వర్గాల నాయకులు కలిసి పనిచేయడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### మాజీ మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



మాజీ మంత్రి కేటిఆర్‌తో బేటి అయిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డా.బి.వి.చారి తదితరులు

**ఉప్పల్, జూన్ 26 ప్రభాతవార్త :** మాజీ మంత్రి కేటిఆర్‌తో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు డా.బి.వి.చారి, కంచర్ల సోమిరెడ్డి, బొమ్మగౌని కైలాసపతిగౌడ్, వీరేందర్ తదితరులు బేటి అయిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు హక్కు తొలగించకుండా చూడాలని సూచించారు. డా.బి.వి.చారి జన్మదినం సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

### బంగారు గొలుసు దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

**రెండున్నర తులాల చైన్ స్వాధీనం**



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, జూన్ 26, ప్రభాతవార్త:**
బస్సులో ప్రయాణికుడిగా నటిస్తూ బంగారు గొలుసును దొంగలించిన పాత నేరస్తుడిని అరెస్ట్ చేసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 23వ తేదీన గట్టు సీతారామారావు అనే వ్యక్తి మలక్ పేట లాలాజరు చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణిస్తున్నాడు. కాగా మలక్ పేట యశోద ఆసుపత్రి వద్దకు బస్సు రాగానే తన మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు దొంగతనానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లాలాజర్ బస్టాప్ వద్ద సీసీ కెమెరాలు పరిశీలించిన చాదర్ ఘాట్ పోలీసులు బాధితుడు వెనక నే బస్సు ఎక్కిన పాత నేరస్థుడు మల్లేపల్లి కి చెందిన కామ్లే రతన్ గా గుర్తించారు. శుక్రవారం కామ్రే రతన్‌ను పోలీసులు మల్లేపల్లిలో అదుపులో తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి బంగారు చైన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రతన్ తో పాటు మరో ముగ్గురు సహచరులు సల్మాన్, ఇస్మాయిల్, ఇబ్రహీంలతో కలిసి బస్సులో జనాలు అధికంగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగతనం చేశారని పోలీసులు వివరించారు. కాగా సల్మాన్, ఇస్మాయిల్, ఇబ్రహీంలు పరారీలో ఉన్నారని రతన్ ను రిమాండ్ కు తరలిస్తున్నామని ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తెలిపారు. ఈ మేరకు ఏసిపి రాజా వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### సర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి



బిజేపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కు సర్ దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జింకల మల్లేష్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాల మేరకు తార్నాక డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ క్వార్టర్స్‌తో పాటు పలు కాలనీల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి ఫారాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా జింకల మల్లేష్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు సంబంధించిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అధికారులు నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు ప్రజలంతా సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరల కనుక



ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న నవారు మల్లారెడ్డి: పక్కన బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఒక సోదరునిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ చీరలను కానుకగా ఇస్తున్నారని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్-57 కిందకు వచ్చే అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. మహిళా సాధికారిత, ఆర్థిక స్వావలంబనకు సిఎం రేవంత్‌రెడ్డి తోడ్పాటు నందిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పని తీరు, చిత్తశుద్ధిని గమనిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు అండగా ఉంటూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని మల్లారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎదుళ్ళ ప్రతాప్‌రెడ్డి, వి.అనిల్, నర్సింహ, రవికాంత్‌రెడ్డి, యూసుఫ్‌రెడ్డిలతో పాటు పలువురు కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

### మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ



మొహరం పీర్ల పండుగలో పాల్గొన్న అనిల్ యాదవ్, మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, దయానంద్ ముదిరాజ్ తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి మీర్‌పేట్ డివిజన్-60లో మొహరం పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీకగా జరిగింది. డివిజన్‌లోని జిల్లెలగూడ దాసరి నారాయణ రావు కాలనీ, కమలా నెహ్రూనగర్ కాలనీల్లో మహనీయుల విగ్రహాల వద్ద పండుగ సందర్భంగా దాత మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం పెద్దలు, స్థానిక మైనారిటీలు, పలువురు నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు నలభై సంవత్సరాలుగా పీర్ల పండుగను నిర్వహిస్తున్న వంగూరు మల్లయ్య యాదవ్, ఐతరాజు యాదయ్య, బొమ్మకంటి దానం ముదిరాజ్, ఐతరాజు వెంకటేశ్‌లను అభినందించారు. గత ఆరు సంవత్సరాలుగా పీర్లను ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, సుర్వి లత శేఖర్ గౌడ్, బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, భీమరాజు బిక్షపతి, ఉట్కూరి నవీన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళన గోడపత్రిక ఆవిష్కరిస్తున్న పిడమర్తి రవి, కృష్ణయ్య వంశరాజు తదితరులు

**రామంతాపూర్, జూన్ 26 ప్రభాతవార్త :**
తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్ రాజేంద్రనగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం గోడ పత్రికను పలువురు నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిరగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూన్ 28న ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలలో భాగంగా 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదే విధంగా పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు వేల సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. కృష్ణయ్య వంశరాజు, బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, కళాకారులు పిడమర్తి రాంబాబు, భూక్య హరినాయక్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.